

లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వరద నీరు.. రాకపోకలు మళ్లింపు

శేరిలింగంపల్లిలో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలను మళ్లించారు. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది వరదనీటి మళ్లింపు పనులు చేపట్టారు. – శేరిలింగంపల్లి


ప్రేమ్‌నగర్ ఈద్గా వద్ద ..
శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు

భక్తిశ్రద్ధలతో 'బక్రీద్'

ఈద్గాలు, మసీదుల్లో ప్రార్థనలు



'బక్రీద్' వేడుకలను సోమవారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ముస్లింలు ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ఆదిత్యనగర్ ఈద్గా, ప్రేమ్‌నగర్ ఈద్గా, గుట్టలబేగంపేట ఈద్గా, న్యూహఫీజ్‌పేట్ ఈద్గాలతో పాటు ప్రతి కాలనీ,బస్తీలలోని మసీదులలో సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సైబరాబాద్ పోలీసులు, మాదాపూర్ అదనపు డీసీపీ జయరామ్, మియాపూర్ ఏసీపీ నర్సింహారా బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. – హఫీజ్‌పేట్




ఆదిత్యనగర్ ఈద్గా వద్ద .. జగదీశ్వర్‌గౌడ్


ఆదిత్యనగర్ ఈద్గా వద్ద ప్రార్థనలు


న్యూహఫీజ్‌పేట్‌లోని ఈద్గాలో ..

పరామర్శ


బీజేవైఎం నాయకుడిని పరామర్శిస్తున్న రవికుమార్ యాదవ్ తదితరులు

హఫీజ్‌పేట్: మెదక్‌లో జరిగిన దాడి ఘటనలో గాయపడ్డ బీజేవైఎం నాయకుడిని సోమవారం బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ పరామర్శించారు. మియాపూర్ పద్మావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతన్ని కలిసి మాట్లాడారు. గోవధ నిషేధం, గో సంరక్షణ అని ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చిన ఎక్కడో ఒక చోట రోజు గోవధ జరుగుతూనే ఉందన్నారు. దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీసీపీ, సీఐలను కోరడం జరిగిందన్నారు. బీజేవైఎం నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు కుమార్‌యాదవ్, అమర్ యాదవ్, మహేష్, మాణిక్ రావు, శ్రీధర్‌గౌడ్, ఆకుల లక్ష్మణ్, జితేందర్, గణేష్ ముదిరాజ్, పవన్ యాదవ్, కోమల్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు భార్గవ లక్ష్మీనరసింహస్వామి తెలిపారు .స్వాతి నక్షత్రం సందర్భంగా మంగళవారం ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, ప్రత్యేక హోమం, రాత్రి 7గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

యునైటెడ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని మొగులమ్మ కాలనీలోని యునైటెడ్ ఫెలోషిప్ చర్చిలో నిర్వహించిన ప్రార్థనలు, స్తుతి ఆరాధనలు, వాక్య పరిచర్య కార్యక్రమానికి సోమవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరయ్యారు. భాస్కర్, వాసుదేవరావు, పాస్టర్స్ శ్యాముల్, శ్యామ్ జాషువా, సత్యరాజు, స్టీఫెన్, కోకిల శామ్యూల్, ప్రసాద్, విష్ణుకుమార్, నరసింహ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


సాయిదత్త గణపతి ఆలయం


పూజల్లో పాల్గొన్న మహిళలు

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయ దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేశారు. ఆలయ నిర్వాహకులు డి రవీందర్ రెడ్డి, డి నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు వివివిఎస్ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను జరిపారు. ఆలయంలో ఉదయం షిర్డీ సాయిబాబాకు కాగడ హారతితో ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో రుద్ర హోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి చేశారు. విష్ణు సహస్ర నామసహిత లక్ష్మీ అష్టోత్తర పారాయణం, సాయిచాలీసా, నక్షత్రమాలిక పారాయణం చేశారు. సాయంత్రం కాలనీలో సాయిబాబా పల్లకిసేవ (నగరసంకీర్తన) రాత్రి శేజ్ హారతితో వేడుకలు ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

హర్షం

రాయదుర్గం: హోంగార్డుల నియామకం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడం పట్ల హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చాంద్‌పాషా సోమవారం హర్షం వెలిబుచ్చారు. ఓడీ విభాగాలలో పనిచేసే హోంగార్డులకు రెగ్యులర్ డ్యూటీలు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తుతం చేపట్టే నియామకాలలో వీరిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

హోప్ ఫౌండేషన్ చేయూత



మాదాపూర్: పేద కుటుంబానికి చెందిన శ్రీనిఖిత ,నవసాయి విద్యార్థుల ఫీజుల నిమిత్తం రూ. 30వేల రూపాయలను లయన్స్‌క్లబ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ వారి తండ్రికి అందజేశారు. లయన్స్ సభ్యులు సోమనాగరాజు, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మెదక్ ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు



రాయదుర్గం: మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్‌రావును నానక్‌రాంగూడ బీజేపీ నాయకులు సోమవారం కలిశారు. నానక్‌రాంగూడ శివారులోని ఆయన నివాసంలో శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళామోర్చా అధికార ప్రతినిధి వరలక్ష్మీ, గచ్చిబౌలి డివిజన్ అర్బన్ జిల్లా కిసాన్‌మోర్చా కార్యవర్గసభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షుడు శివసింగ్, బబ్లూసింగ్, జితేందర్‌రెడ్డి, గోపాల్, ఉమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్లపై వర్షపు నీరు తొలగింపు



రాయదుర్గం: భారీ వర్షం కురవడంతో పలుచోట్ల రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. గచ్చిబౌలి, బయోడైవర్సిటీ పార్కు కూడలి ప్రాంతాలలో రోడ్లపై భారీ వరద పారింది. దీంతో శేరిలింగంపల్లి సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఈ విశాలాక్షి, ఇతర అధికారులు, సిబ్బంది నీటిని మ్యాన్‌హోళ్ల ద్వారా నాలాలలోకి వెళ్ళేలా ఏర్పాట్లు చేశారు. అన్ని ప్రధాన కూడళ్లను అధికారులు పర్యవేక్షించారు.



వర్షంలో సరదాగా..

వర్షంలో యువకులు, చిన్నారులు క్రికెట్ ఆడుతూ సంబరపడ్డారు. భెల్ కాలనీలో సోమవారం సాయంత్రం ఒకసారిగా వర్షం కురవడంతో యువకులు ఆనందంతో ఆడుతుండగా కొంతమంది వారిని ఫొటోలు తీస్తూ కనిపించారు. – రామచంద్రాపురం(పటాన్‌చెరు)

'సర్వీస్' రోడ్డు లేక..


మదీనాగూడ ప్రాంతంలో సర్వీస్ రోడ్డు లేకపోవడంతో రోడ్డు పక్కన పార్కింగ్

కొన్నిచోట్ల రోడ్లు పార్కింగ్ ఏరియాగా..

- ఇబ్బందుల్లో పాదచారులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మియాపూర్: జాతీయ రహదారి పక్కనున్న సర్వీస్ రోడ్డు పార్కింగ్ ఏరియాగా మారింది. దీంతో సర్వీస్ రోడ్డులో వెళ్లడానికి దారి లేకపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ రోడ్డు వాహనాలతో నిండిపోవడంతో పాదచారులు జాతీయ రహదారిపై నడుస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు. రహదారి వెంబడి వాణిజ్య, వ్యాపార సంస్థలు, షాపింగ్‌మాల్స్‌కు సరైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో సర్వీస్ రోడ్డులో వాహనాలు నిలుపుతున్నారు. దీంతో చుట్టు పక్కల కాలనీవాసులు ఆయా కాలనీల్లోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు.సర్వీస్ రోడ్డు అందుబాటులోకి తీసుకురావాల్సిన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మియాపూర్, మదీనాగూడ ప్రాంతాల్లో జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు వ్యాపారాలు, పార్కింగ్ ఏరియాలుగా మారాయి.

- మియాపూర్, మదీనాగూడ జాతీయ రహదారికి ఇరువైపుల వాణిజ్య వ్యాపార సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, హోటల్స్, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్ వందల సంఖ్యలో ఉన్నాయి.
- వీటికి పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో పాటు సెల్లార్‌లలో కూడా వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో వాహనాలను రోడ్డు వెంబడి, సర్వీస్ రోడ్డులో పార్కు చేస్తున్నారు.
- చందానగర్‌లోని గంగారం నుండి ఆల్విన్ క్రాస్ రోడ్డు వరకు, ఆల్విన్ క్రాస్ రోడ్డు నుండి మియాపూర్ మెట్రోస్టేషన్ వరకు సర్వీస్ రోడ్డు అందుబాటులో లేకపోవడంతో వాణిజ్య వ్యాపార సంస్థలకు వచ్చే వినియోగదారులు రోడ్డు పక్కనే వాహనాలను పార్క్ చేస్తున్నారు.
- జాతీయ రహదారి వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇక రోడ్లపైనే వాహనాలను పార్క్ చేయడంతో వాహనదారులకు ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు.
- జాతీయ రహదారి పక్కన పరిసర కాలనీలవాసులకు సర్వీస్ రోడ్డు అందుబాటులో లేకపోవడంతో మెయిన్‌రోడ్డుపైకి రావాల్సి వస్తోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మదీనాగూడలో గత 3 సంవత్సరాల క్రితం సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. మియాపూర్ పోలీస్‌స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద సర్వీస్ రోడ్డును కొంత దూరం చేపట్టి వదిలేశారు. సుమారు రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా పనులు చేయలేదు.
- సర్వీస్ రోడ్డు అందుబాటులో లేకపోవడంతో కొంతమంది వాహనదారులు జాతీయ రహదారిపై యూటర్న్‌ల వద్ద రాంగ్‌రూట్‌లో వెళ్లి రోడ్డు అవతలికి వెళ్తున్నారు. ఈ క్రమంలో యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీస్ రోడ్డు, జాతీయ రహదారిపై వరకు వాహనాలు పార్కింగ్ చేసి ఉండడంతో నిత్యం రోడ్డుపై ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి.
- మియాపూర్ మదీనాగూడలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ నుండి మియాపూర్ మెట్రో స్టేషన్ వరకు పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఫుట్‌పాత్‌ల పై వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో పాదచారులు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డులో వ్యాపారాలు, వాహనాల పార్కింగ్‌లను తొలగించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.





నెక్టార్ గార్డెన్ వద్ద వరద సమస్య

నిలిచిన వాహనాల రాకపోకలు

గచ్చిబౌలి: వరద నీటితో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మాదాపూర్‌లోని నెక్టార్ గార్డెన్ వద్ద వరద నీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో వర్షం పడినప్పుడల్లా వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై వరద నీరు చేరడంతో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వరద నీటిని తొలగించి, వాహనాలను మళ్లించారు.



కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 70, పచ్చిమిర్చి 100, బెండ 60, కాకర 70, దొండ 50, దోస 40, ఆలు 40, చామ 60, కీర 40, బీర 100, వంకాయ 40, గోకర 70, బీన్స్ 180, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 40, క్యారెట్ 70, చిక్కుడు 120, ఉల్లి 35(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 280.

కాశీ విశ్వేశ్వరస్వామికి రుద్రాక్షల అలంకారం



రాయదుర్గం: గాయత్రీదేవి జన్మదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు.సోమవారం కాశీ విశ్వేశ్వరస్వామికి రుద్రాక్షలతో ప్రత్యేక అలంకారం చేశారు. అర్చనలు, అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లోని శ్రీ భూనీల సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ వేడుకల్లో నిత్యారాధన, సేవా కాలం, బలిహరణం, మహా పూర్ణాహుతి, ఉత్సవమూర్తులకు 108 కలశాల చక్రస్నానం, తిరుమంజన సేవ, అలంకరణ, పుష్పయాగం, ఏకాంత సేవతో పూజా కార్యక్రమాలు ముగిశాయి. పూజా కార్యక్రమాల్లో బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్, గుత్తికొండ రామకృష్ణ, ఏడుకొండలు, కృష్ణ, సైదయ్య, పులిగొళ్ల శ్రీలక్ష్మీ, అంజమ్మ, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పరిశీలన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించేలా చేస్తామని తెలిపారు. కాలనీలో కొంతమేర పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ లైన్‌లను త్వరలో పూర్తి చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాస్కర్, వాసుదేవరావు, శామ్యూల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు


హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో రోడ్డుపై మురుగునీరు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగిపొర్లడంతో స్థానికులకు ఇబ్బందిగా మారింది. గాంధీ అపార్టుమెంట్ సీ బ్లాక్ ముందు భాగంలో గత కొంతకాలంగా డ్రైనేజీ పొంగి రోడ్డుపై పారుతుండడంతో రాకపోకలకు అసౌకర్యం కలుగుతోంది. ఈ విషయంలో సీవరేజ్ బోర్డు అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తప్పని ఇబ్బందులు..


గుంతలో ఇరుక్కున్న కారు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మై ఫెయిర్ విల్లాస్ నుంచి ఉస్మాన్‌నగర్ వెళ్లే మార్గంలో రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ మార్గంలో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వేసేందుకు రోడ్డు తవ్వారు. పైపులైన్ వేసిన తరువాత రోడ్డును బాగు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.వర్షం పడడంతో పైపులైన్ కోసం తవ్విన గుంతలలోని మట్టి కుంగిపోయింది. దీంతో కార్లు వెళ్లినప్పుడు అందులో ఇరుక్కుంటున్నాయి. ప్రజలు కాలనీలలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

టాస్కుల పేరిట సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: టాస్కులు, కమీషన్ల పేరిట ఓ వ్యక్తి రూ. 82 వేలు పోగొట్టుకోగా, మరో వ్యక్తి రూ.49 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఓడిఎఫ్ కాలనీకి చెందిన డ్రైవర్‌కు ఏప్రిల్ 4వ తేదీ టాస్కులు పూర్తి చేస్తే, కమీషన్ ఇస్తామని వాట్సాప్‌కు లింకు రావడంతో దాన్ని క్లిక్ చేసి అతడి వివరాలను నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా పలు దఫాలుగా రూ. 82 వేలు వేశాడు. అనంతరం పెట్టిన నగదుతో పాటు, కమీషన్ ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ఓ మెడికల్ షాప్ నిర్వాహకునికి ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తే నగదు రెట్టింపు ఇస్తామని లింక్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి, పలు దఫాలుగా రూ. 49 వేలు వేశాడు.చివరికి బాధితుడు తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లింగంపల్లిలో చైన్‌స్నాచింగ్

3 తులాల బంగారు గొలుసు అపహరణ

హఫీజ్‌పేట్: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శివాజీనగర్‌లో నివాసముండే తులసి లక్ష్మి (28) సోమవారం గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో విధులు ముగించుకొని లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి శివాజీనగర్‌కు వస్తుండగా సిటిజన్ కాలనీ సమీపంలోకి రాగానే ఆమె పక్క నుంచి వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. దీంతో ఆమె చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం కాలనీలోని పరిసర ప్రాంతాలలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.